క్లుప్తంగా

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ఆర్ వీఆర్ జేసీ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు పీఎస్ సుభాషిణికి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. స్పీకర్ రికగ్నైజేషన్ యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఆల్గారిథమ్స్ అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల డైరక్టర్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి రంగబాబు తదితరులు అభినందించారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

పెదకాకాని: పెదకాకాని నాలుగో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 16 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావుకు అందజేశారు. అలానే వెనిగండ్ల గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు.

పోలింగ్ బూత్ పరిశీలన



బోడిపాలెం(కాకుమాను): పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పార్వతి అధికారులకు సూచించారు. మండలం లోని బోడిపాలెం, కోతివానిపాలెం, చిన కాకుమాను, తెలగాయపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలలో ఫ్యాన్లు, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ రమణ్ సిబ్బంది ఉన్నారు.

వడదెబ్బకు యాచకురాలు మృతి



గుంటూరు రూరల్: వడదెబ్బకు యాచకురాలు మృతి చెందిన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పొత్తూరు సమీపంలోని దంత వైద్య కళాశాల సమీపంలో గుర్తు తెలియని మహిళ (55) అపస్మారక స్థితిలో పడి ఉందని స్థానికులు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉంది. మృతురాలు సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుందని పోలీసులు తెలిపారు.

నకిలీ టికెట్లు అమ్మే వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లో నకిలీ రిజర్వేషన్ టికెట్లను చేయించే వ్యక్తిని జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఒ.విజయ్‌కుమార్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ల వద్ద రిజర్వేషన్ చేయిస్తానని ప్రయాణికులను మోసగిస్తుంటాడు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.

టీడీపీకి ధనం..వైఎస్సార్ సీపీకి జనం

- ప్రజలే తమ బలమన్న కిలారి, బలసాని
- వైఎస్సార్ సీపీలోనే యాదవులకు రాజకీయ ప్రాధాన్యం
- యాదవ సామాజిక వర్గ ఆత్మీయ సదస్సులో గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య
- తమ్ముడిగా నన్ను ఆదరించండి: ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్



ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి రోశయ్య, బలసాని కిరణ్‌కుమార్‌లకు గొర్రె పిల్లలు, పిల్లనగ్రోవిని బహూకరిస్తున్న యాదవ సోదరులు

ప్రత్తిపాడు: యాదవులకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో గురువారం రాత్రి నియోజకవర్గ స్థాయి యాదవ సామాజిక వర్గ ఆత్మీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కిలారితోపాటు ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ హాజరవగా యాదవ సోదరులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రామవాగు బ్రిడ్జి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. బొల్లావులను తలపై పెట్టుకుని, పార్టీ జెండాలు ఊపుతూ బలసాని రోడ్‌షో ప్రారంభించారు. ట్రాక్టర్లతో యాదవ యువత, రైతులు పాల్గొని జై జగన్.. జై కిలారి..జై బలసాని అంటూ నినాదాలు చేశారు. అనంతరం ద్విచక్రవాహనాల ర్యాలీతో, డీజే , బాణాసంచా పేలుళ్ల మధ్య పూలవాన కురిపించారు.

స్థితి గతులను బేరీజు చేసుకోండి

పదేళ్ల కిందట..ఇప్పుడు యాదవుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో చోటుచేసుకున్న మార్పును బేరీజు చేసుకోవాలని గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య కోరారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా యాదవులకు అధిక ప్రాధాన్యమిచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగించారన్నారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన గల్లా జయదేవ్ పత్తాలేకుండా పారిపోయారని, ఇప్పుడు అభ్యర్థులు దొరక్క అమెరికా నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు డబ్బున్న అహంకారిని దిగుమతి చేసుకున్నారని విమర్శించారు.

అమెరికాలో వేల కోట్ల రూపాయల మేర పన్నులు కట్టే వ్యక్తి, ఒక్క రూపాయి అయినా దేశంలో పన్ను కడుతున్నాడా అని ప్రశ్నించారు. అమరావతిని భ్రమరావతి చేసి రైతు పుట్టి ముంచిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. వాళ్లది తెలుగుదేశం పార్టీ కాదని, తెలుగు దుష్ప్రచార పార్టీ అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.16 లక్షల కోట్ల సంక్షేమాన్ని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటింటికీ చేరిస్తే, అందులో 1.76 లక్షల కోట్లు కేవలం బీసీల సంక్షేమానికే కేటాయించిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. యాదవులతో పాటు యావత్ బీసీలు పార్టీకి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు.

తమ్ముడిగా ఆదరించండి : బలసాని కిరణ్ కుమార్

ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డికి యాదవుల పట్ల మమకారం ఉందన్నారు. యాదువులు, మాదిగ సోదరులు తనను తమ్ముడిగా భావించి ఆదరించాలని కోరారు. తనకూ కౌరవులు ఎక్కువైపోతున్నారని, అర్జునుడిలా ఒంటరిగానే పోరాటం చేస్తున్నానని ఉద్వేగభరితంగా చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కిలారిని గెలిపించాలని బలసాని విజ్ఞప్తి చేశారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

యాదవులు కృష్ణావతారం ఎత్తాలి : నాగార్జునయాదవ్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 6,70 యాదవ సామాజిక వర్గ కుటుంబాలుంటే అందులో గడిచిన ఐదేళ్లలో 6193 గృహాలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇదో అరుదైన రికార్డని తెలిపారు. యాదవ సోదరులంతా కృష్ణావతారం ఎత్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించాలని, బలసాని కిరణ్‌కుమార్, కిలారి రోశయ్యల గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, యాదవ నాయకులు గోరంట్ల శివశంకర్ యాదవ్, డొక్కు కాటంరాజు యాదవ్, దాది శివబాబు, దారం అశోక్‌కుమార్, ఆరదల సాంబశివరావుయాదవ్, గండు నాగరాజు యాదవ్, మేకల హనుమంతు, కుర్రా గోపాలకృష్ణయాదవ్, ఆళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన యాదవ సోదరులు



వేదికపై బాణం సంధిస్తున్న కిలారి రోశయ్య, బలసాని కిరణ్‌కుమార్

టీడీపీది బూటకపు మేనిఫెస్టో

- అంబటి మురళీకృష్ణ విమర్శ
- అమలుకు నోచని చంద్రబాబు హామీలను నమ్మొద్దు
- మంచి చేసేవారినే ఆదరించండంటూ విజ్ఞప్తి



చిన్నారిని ఎత్తుకున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు : రానున్న ఎన్నికల్లో విజయం కోసం అమలుకు సాధ్యంకాని హామీలతో చంద్రబాబు బూటకపు మేనిఫెస్టో ప్రకటించారని, ప్రజలు నమ్మవద్దని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని దొప్పలపూడి, పచ్చలతాడిపర్రు, గోళ్లమూడిపాడు, మామాళ్లపల్లి, మునిపల్లె గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి, వీరతిలకం దిద్దారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గడిచిన 59 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదల మేలు, రాష్ట్రాభివృద్ధి కోసం మేనిఫెస్టో ప్రకటిస్తే, చంద్రబాబు మేనిఫెస్టో అధికారమే లక్ష్యంగా అద్దంపడుతోందని విమర్శించారు. ఈనెల 13న జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు నొక్కి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కూచిపూడి స్వరూపారాణి, జాలాది యానాదిరావు, మోస య్య, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్, షేక్. నాజర్, వడ్రాణం ప్రసాద్, బొద్దులూరి రంగారావు, బొనిగల వేణుప్రసాద్, బి. రవి, సుబ్బారావు, పిచ్చిరెడ్డి, ప్రభుదాస్, షేక్. సుభాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరు 16వవార్డులో జోరుగా..

పట్టణంలోని 16వ వార్డులో వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణను గెలిపించాలని కోరుతూ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరుతూ ప్రచార పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యూష, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు మహమ్మద్ సలీమా బేగం, షేక్. షర్మిల, గేరాకుమారి, అనిల కుమారి, అబ్దుల్ ఖాదర్, షేక్. సుభాని, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

రహస్య ఓటింగ్ పద్ధతిలో హోం ఓటింగ్

తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి



అధికారులకు సూచనలు చేస్తున్న తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని రహస్య ఓటింగ్ విధానంలో చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్ పై ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాల సభ్యులకు, బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు అత్యంత కీలకమని, ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా అమలు చేయనున్న హోం ఓటింగ్ విధి, విధానాలపై విధులు కేటాయించబడిన వారంతా సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డు చేయబడుతుందని, పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు కూడా ఉండవచ్చని తెలిపారు. కాని ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తూర్పు నియోజకవర్గంలోని హోమ్ ఓటింగ్ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామమని, ఆయా బృందాలను పర్యవేక్షణకు ఏఆర్‌ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ల టీంలను నియమించినట్లు వివరించారు. ఒక్కో బృందానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని, పోలింగ్ స్టేషన్ల వారిగా విధులు కేటాయించబడిన సిబ్బంది సంబంధిత బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని హోం ఓటర్లకు ఓటింగ్ విధానం, ఏ రోజు ఓటు వేయాలి, అవసరమైన గుర్తింపు కార్డులు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. సెక్టార్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించడానికి వైర్ లెస్ సెట్‌లు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏఆర్‌ఓలు భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సీఎంఓ హెచ్ డాక్టర్ ఆషా, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ ఏర్పాట్లు పరిశీలన

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు తూర్పు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల ర్యాండమైజేషన్ మేరకు ఈవీఎంలను కమిషనింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని తూర్పు రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి తెలిపారు. గురువారం స్థానిక ఏసీ కాలేజీలో నిర్వహించనున్న ఈవీఎంల కమిషనింగ్ ఏర్పాట్లపై తూర్పు నియోజకవర్గంలోని పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో, అధికారులతో కలసి ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూమ్‌ని ఓపెన్ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు తూర్పులో పోలింగ్ కేంద్రాల వారిగా ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి అయిందని, ఏసీ కాలేజ్‌లోని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోని ఈవీఎంల కమిషనింగ్ ఈ నెల 3 తేదీన చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ని ఓపెన్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పర్యటనలో ఏఆర్‌ఓ, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ మురళి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అవ్వాతాతల ఇబ్బందులకు బాధ్యుడు చంద్రబాబే

- అంబటి మురళీకృష్ణ ఆరోపణ
- రానున్నది మన ప్రభుత్వమే ..
- ఆందోళన వద్దంటూ భరోసా



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబటి



ప్రచార వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ...

పొన్నూరు : పింఛన్ల విషయంలో రాష్ట్రంలోని లక్షలాది మంది అవ్వాతాతల ప్రస్తుత అవస్థలకు చంద్రబాబు నాయుడే కారణమని పొన్నూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. ఈ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు, జనసేనతో కలిపి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది ముమ్మాటికీ చంద్రబాబే అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఉసురు బాబుకు తగులుతుందన్నారు. ఈ ఇబ్బందులు కొద్దిరోజులు మాత్రమేనని, రానున్నది జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబటి మురళీకృష్ణ నిడుబ్రోలులోని 13,14,15 వార్డుల్లో జోరుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు.

ఫ్యాన్ కే ఓటేస్తాం..

ప్రచారంలో భాగంగా 13వ వార్డు లో పార్టీ నాయకులు అంబటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబటి మురళీకృష్ణకు ఘన స్వాగతం పలికారు. కేక్ కట్ చేశారు. రానున్న ఎన్నికలలో తనను గెలిపించాలని అంబటి మురళీకృష్ణ ఓట్లను అభ్యర్థించగా..'జగనన్న పథకాలతో లబ్ధి పొందాం. ఫ్యాన్ గుర్తుకే మా ఓటంటూ' ముక్తకంఠంగా పలికారు. తనను ఆశీర్వదించాలని వృద్ధులను కోరగా జగనన్న నిర్ణయించిన వ్యక్తి మీరు మా ఓటు మీకే ' నంటూ ఆప్యాయంగా సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఏఎం, చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, బొద్దులూరి రంగారావు,షేక్. నాజర్, వడ్రాణం ప్రసాద్, అమిర్నేని సాంబశివరావు, మూకిరి అనిలా కుమారి, వట్టిప్రోలు రంగారావు, మూర్తిరాజు, మల్లెలరాజు, తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల ప్రచారం

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పరిశీలన



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజకుమారి, ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్

మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 300 పోలింగ్ కేంద్రాలకు 1080 బ్యాలెట్ యూనిట్లు, 360 కంట్రోల్ యూనిట్లు, 388 వీవీ ప్యాట్స్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కేటాయించడం జరిగిందని ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారితో కలసి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రానికి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్స్‌ను కేటాయించడం జరిగిందన్నారు. పోటీలో పాల్గొంటున్న అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో ర్యాండమైజ్ చేసి పోలింగ్ కేంద్రం వారీగా జాబితాలను ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు అందజేయడం జరిగిందన్నారు. మరోవైపు శుక్రవారం ఉదయం నుంచి హోమ్ ఓటింగ్ నిర్వహించేందుకు 15 బృందాలు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: గత నెలలో విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు నగరంలోని ప్రభుత్వ, నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం అవగాహన యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీలోని సన్మానించారు. ఈసందర్భంగా ఇబ్రాయిల్‌పేటలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల నుంచి 582 మార్కులు సాధించిన విద్యార్థిని ఫాతిమా తబస్సుమ్‌తో పాటు అదే ప్రాంతంలోని సెయింట్ లారెల్స్ హైస్కూల్ నుంచి 588 మార్కులు సాధించిన మొహమ్మద్ గౌస్ నయీముద్దీన్‌ను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు.

రూ.2 లక్షలు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వలైనులో సూర్యదేవర కృష్ణ రూ.2 లక్షలు నగదుతో వెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి ఆధారం లేకుండా నగదు తీసుకెళుతున్నట్లు ధ్రువీకరించి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కుమార్ వివరాల మేరకు.. విజయవాడకు చెందిన గడ్డేటి సుధాకర్(35) తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై గుంటూరు మీదుగా చిలకలూరిపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వై జంక్షన్ వద్ద వెనుకనుంచి మితిమీరిన వేగంతో లారీ దూసుకొచ్చి సుధాకర్ వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తీవ్రగాయాలతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారవుతుండగా రక్షక్ పోలీసులు వెంటపడి అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒక్క అవకాశమివ్వండి

- పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విజ్ఞప్తి
- ఫ్యాన్ గుర్తుకు ఓటు అభివృద్ధికి రూటని వ్యాఖ్య
- అగతవరప్పాడు, వెనిగండ్లలో ఎన్నికల ప్రచారం
- హారతులిచ్చి స్వాగతించిన మహిళలు



హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న అగతవరప్పాడు మహిళలు

పెదకాకాని: ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పొన్నూరు నియోజకవర్గానికి సేవ చేసే అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెదకాకాని మండలం అగతవరప్పాడు, ఏవీఎస్‌కాలనీ, వెనిగండ్ల సుందరయ్య కాలనీల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. కంటి వైద్య పరీక్షలు చేసి కళ్ళజోళ్ళు పంపిణీతో పాటు గుండె పరీక్షలు చేసి ఎంజియోగ్రామ్ సర్జరీలు చేయించడం జరిగిందన్నారు. అలానే ఫిజియోథెరపీ సేవలు, కృత్రిమ కాళ్ళు అవసరమైన వారికి జైపూర్ కాళ్ళు అందజేయడం జరిగిందన్నారు. అగతవరప్పాడు ఏవీఎస్ కాలనీ ప్రజలందరికీ ఇళ్ళ పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పర్యటించి 27 వేల మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా కేవలం ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే మీ ముందుకు వచ్చి ఓటు అభ్యర్థిస్తున్నానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పొన్నూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

ధూళిపాళ్లను దులిపేసిన అంబటి

పాతికేళ్లుగా సంగం డెయిరీని పీల్చి పిప్పి చేస్తున్న ఘనుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని అంబటి మురళీ కృష్ణ ఆరోపించారు. సంగండైరీలో రూపాయి పెట్టుబడి పెట్టకుండా ధూళిపాళ్ల ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆ డబ్బుతో 11 ఎకరాల్లో డీవీసీ పేరుతో ఆసుపత్రి నిర్మించడం జరిగిందన్నారు. పాడి రైతులు అనారోగ్యానికి గురైతే ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని ఆసుపత్రి నిర్మించి కార్పొరేట్ ఆసుపత్రి మాదిరిగా ఫీజులు వసూలు చేస్తున్నారని,, అదే వైద్యానికి డైరీ నుంచి బిల్లులు పెట్టుకుని డైరీ సొమ్ము కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాతికేళ్లుగా చేసిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ ఐదేళ్ళ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలు బేరీజు చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, షేక్ సబీహాసుల్తాన్, కుంచల కోటిరెడ్డి, నారాయణరెడ్డి, గాబ్రేలు, ఆట్ల సుబ్బారెడ్డి, పిట్టు రుద్రారెడ్డి, మాజీ సర్పంచి గద్దే కిషోర్, చాగంటి మురళిమోహన్‌రెడ్డి, వుయ్యూరు సతీష్‌రెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, పెరుమాళ్ళ అనిల్‌కుమార్, తాడిబోయిన వేణుగోపాల్, కూచిపూడి మధు, మున్నంగి రవీంద్రారెడ్డి, షేక్ ఖాశిం పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ గ్రూప్-డి ఉద్యోగులకు ఘన సత్కారం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సజావుగా పని చేయడంలో అమూల్యమైన అద్భుతమైన సేవలను అందించినందుకు గ్రూప్ డి ఉద్యోగులు అభినందనీయులని డివిజన్ మహిళా సంక్షేమం అధ్యక్షురాలు ఎం.ఆశాలత అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజన్ పరిధిలోని మే డేను పురస్కరించుకుని గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ రైల్వేలు సజావుగా సాగేందుకు తెరవెనుక పని చేసే గ్రూప్ డి ఉద్యోగులే నిజమైన హీరోలని అన్నారు. రైల్వేల ప్రతిష్టను నిర్మించడంలో గ్రూప్ డి సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సిబ్బంది చేస్తున్న మంచి పనిని గుర్తించి వారి మనోధైర్యాన్ని పెంచడం మా బాధ్యత అని చెప్పారు. అనంతరం పలువురు డివిజన్ గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా సంఘం కార్యదర్శి ఎస్.వి. సాయి అఖిల, పి.షర్మిల, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.